సాక్షి
సంగారెడ్డి
శనివారం। 5। ఏప్రిల్। 2025


పటాన్‌చెరులోని పారిశ్రామిక వాడ

న్యూస్‌రీల్

సీతారామ కల్యాణానికి మంత్రి దామోదరకు ఆహ్వానం

జోగిపేట(అందోల్): జోగిపేటలోని శ్రీపబ్బతి హనుమాన్ దేవాలయంలో ఈనెల 6న జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి హాజరు కావాలని మంత్రి దామోదర రాజనర్సింహను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో శుక్రవారం దామోదరను కలిసి ఆహ్వాన పత్రిక ను అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో జోగిపేట మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ ఎ.చిట్టిబాబు, ఆలయ పూజారి లక్ష్మణాచారి, ఆత్మక మిటీ సభ్యుడు చిట్యాల మధు, యువజన కాంగ్రెస్ నాయకుడు డాకూరి రఘునాథ్ ఉన్నారు.

నూకలు లేకుండా పంపిణీ చేయాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి


దేవులపల్లిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): పేదలకు నూకలు లేకుండా సన్న బియ్యం పంపిణీ చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. హత్నూర మండలం దేవులపల్లి గ్రామంలో శుక్రవారం రేషన్ దుకాణంలో సన్నబియ్యాన్ని ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సన్న బియ్యం పేరుతో నూకలు పంపిణీ చేయొద్దని దీనివల్ల లబ్ధిదారులకు నష్టమే తప్ప లాభం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫొటోలకు తప్ప ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే అధికారులను అప్రమత్తం చేసి పేదలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

ఐలా అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


ఎమ్మెల్యేను కలిసిన ఐలా నూతన కార్యవర్గం

పటాన్‌చెరు: పటాన్‌చెరు పారిశ్రామికవాడ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు ఐలా నూతన కార్యవర్గం కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ...ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో పరిశ్రమల యాజమాన్యాలకు ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

పోషకాహారలోపం నిర్మూలనకు కృషి

సంగారెడ్డిజోన్: జిల్లాలో పోషకాహార లోపాన్ని నిర్మూలించేందుకు అందరి సమన్వయంతో కృషి చేస్తామని జిల్లా సంక్షేమాధికారి లలిత కుమారి పేర్కొన్నారు. హైదారాబద్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ శుక్రవారం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న లలితకుమారి మాట్లాడుతూ...పోషకాహారం తగ్గించడంపై జిల్లా, గ్రామస్థాయిలో ప్రతీ ఒక్కరు బాధ్యత వహించాలన్నారు.

శ్రీరామనవమి ప్రశాంతంగా జరుపుకోవాలి

శాంతి సమావేశం నిర్వహించిన డీఎస్పీ

సంగారెడ్డి క్రైమ్: శ్రీరామనవమి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ సత్తయ్య గౌడ్ సూచించారు. సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని యువకులంతా కులం, మత భేదం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని తెలిపారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో ఎవరికీ ఇబ్బంది కలిగించొద్దని పట్టణ సీఐ రమేశ్ సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని సభ్యులు, ఇస్లామిక్ సభ్యులతో పాటు ఇతరులు పాల్గొన్నారు.


❒ కొన్ని నెలల క్రితం అసోం రాష్ట్రానికి చెందిన మధుబ్ బోరా తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. స్థానికంగా ఓ నిర్మాణ సంస్థలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. వచ్చిన కొద్దిరోజులకే గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారికి ఇక్కడికి వచ్చే ఆర్థికస్థోమత లేకపోవడంతో కనీసం చివరి చూపు కూడా చూసుకోలేకపోయారు. దీంతో పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించారు.


❒ బిహార్ రాష్ట్రానికి చెందిన సాగిర్ జీవనోపాధికై కొన్ని నెలల క్రితం తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. స్థానిక నిర్మాణ రంగ సంస్థలో పనిచేస్తున్నాడు. ఒక రోజు సిమెంట్ మిల్లర్‌ను శుభ్రం చేస్తూ అందులో పడి మృతి చెందాడు. దీనిని బట్టి చూస్తే పని చేసే ప్రదేశంలో వారికి ఎంత భద్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


❒ కొద్ది రోజుల కిత్రం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికుడి చేతులు మెషీన్‌లో పడటంతో రెండు చేతులు కోల్పోయాడు. అతనికి అతి తక్కువ నష్టపరిహారం అందించి ఎవరికీ తెలియకుండా స్వగ్రామానికి పంపించేశారు.


❒ ఇటీవల బిహార్ కు చెందిన సంజీత్ కుమార్ తెల్లాపూ ర్‌కు వచ్చి వలస కార్మికుడిగా పనిచేస్తున్నాడు. డబ్బులు సరిపోకపోవడంతో లేబర్ క్యాంపులో గంజాయికు డిమాండ్ ఉందని గమనించిన సంజీత్ పెడదోవ పట్టాడు. తన మిత్రుల ద్వారా గంజాయిను తెప్పించుకుని విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

మినీ ముంబైగా పేరొందిన పారిశ్రామిక వాడ పటాన్ చెరు, రామచంద్రాపురం ప్రాంతాల్లో ఇలాంటి వలస కార్మికుల విషాదగాథలు సర్వ సాధారణం. ఉపాధి దొరక్క పొట్ట చేతబట్టుకుని ఉన్న ఊరిని, కన్నతల్లిని వీడి తమ శ్రమనే నమ్ముకుంటూ వలస వచ్చిన కష్టజీవికి ఎంత కష్టం ఎంత నష్టం. నరాల బిగువ, కరాల సత్తువ వరాల వర్షం కురిపించాలని కోరుకుంటూ పనికోసం వచ్చిన బతుకుజీవికి తన స్వప్నం తొణికి తాననుకున్న స్వర్గం తొలగితే ఎంత నిరాశ.. ఎంత నిస్పృహ. కూలి కోసం, కూటి కోసం పట్టణంలో బతుకుదామని వలస వచ్చిన బడుగు జీవికి ఎంత కష్టం...ఎంత నష్టం. అవును వలసజీవి ఘర్మ జలానికి, ధర్మ జలానికి ఇక్కడ ఖరీదులేదు మరి. వలసజీవుల శ్రమను దోపిడీ చేస్తూ పరాజిత జీవితాలతో పరాచికాలాడుతున్న పరిశ్రమల దారుణాలెన్నో ఇక్కడ నిత్య కృత్యం. ఈ అధర్మాన్ని నిధనం చేసే ఖడ్గమేదీ లేదిక్కడ. వలస కార్మిక చట్టాలేవీ అమలు కావిక్కడ. ఈ ఆగడాలను అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండిపోవడం ఈ వలస జీవుల పాలిట ఓ అతిపెద్ద విషాదం.

– పర్చా శ్రీనాథ్, రామచంద్రాపురం


పనులకు వెళ్లి వస్తున్న వలస కార్మికులు

- పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రాంతాల్లో... దుర్భరంగా వలస కార్మికుల జీవనం
- అమలుకు నోచుకోని చట్టాలు

పారిశ్రామిక దోపిడీ

వలస జీవుల బతుకు పోరు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉన్న ఊరిలో ఉపాధి కరువై..బుక్కెడు బువ్వ కోసం వలస కార్మికులు పడుతున్న కష్టాలు ఇక్కడ వర్ణనాతీతం. కనీస వేతనాలు లేక శ్రమకు తగిన ఫలితం రాక వారికి అండగా ఉండాల్సిన చట్టాలు అమలు కాక వలస కార్మికులు నరకయాతనకు గురవుతున్నారు. కుటుంబ పోషణ కోసం వేలాది కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న వలస కార్మికులు తిరిగి ఇంటికి ప్రాణాలతో వెళ్తామన్న నమ్మకం కూడా వారిలో లేకపోవడంతో చూస్తే వారి జీవితాలు ఎంత దుర్భంగా ఉన్నామో అర్థం చేసుకోవచ్చు. వలస కార్మికుల కుటుంబాలలో ఇలాంటి ఘటనలు సర్వసాధారణం. ఇన్ని జరుగుతున్నా పాలకులు మాత్రం వలసకార్మికుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం శూన్యం.

జోరుగా వలసలు

అతిపెద్ద పారిశ్రామికవాడైన పటాన్‌చెరు ప్రాంతంలో పరిశ్రమలు, జోరుగా నిర్మాణాలు జరుగుతుండటంతో ఈ ప్రాంతాలకు వలస కార్మికులు పెద్ద ఎత్తున వస్తుంటారు. కేవలం పటాన్‌చెరు, రామచంద్రాపురం పరిధిలోనే సుమారు 2లక్షలకు పైగా వలస కార్మికులుంటారని కార్మిక సంఘాల నేతలు అంచనా వేస్తున్నారు. బొల్లారం, కాజిపల్లి, పాశమైలారం, బొంతపల్లి, హత్నూర, కొండాపూర్, సదాశివపేట్ , జహీరాబాద్‌లతో పాటు జిల్లా వ్యాప్తంగా సుమారు 4లక్షల మంది వలస కార్మికులు ఉండవచ్చని అంచనా.

వ్యాపారంగా మారిన కూలీల తరలింపు

కొంతమంది దీనిని వ్యాపారంగా మార్చివేశారు. ఉత్తర భారతదేశం నుంచి తక్కువ వేతనాలతో పనిచేసే కార్మికులతో ఒప్పందం చేసుకుని వారిని ఇక్కడ తీసుకొస్తున్నారు. వారితో పని చేయిస్తూ దళారులు సంస్థల వద్ద నుంచి డబ్బులు తీసుకుని వీరికి తక్కువ వేతనాలిస్తున్నారు. బహిరంగ రహస్యంగా ఉన్న ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చినా ఈ దళారుల వ్యవస్థకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.

గాలిలో కలుస్తున్న ప్రాణాలు

పరిశ్రమలలో, నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు వారు పనిచేసే చోట సరైన భద్రత లేకపోవడంతో వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ప్రమాదాలలో వలస కార్మికులు మృతి చెందిన వెంటనే వారి మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలించి యాజమాన్యాలు చేతులు దులుపుకుంటున్నాయి. కొన్నిచోట్ల పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే నామమాత్రంగా నగదు ముట్టజెప్పి కుటుంబ సభ్యులతో రాజీపడుతున్నారని కార్మిక సంఘా నేతలు వాపోతున్నారు. ఇవన్నీ సంబంధిత అధికారులకు తెలిసే జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఎలాంటి భద్రత లేకుండా సుమారు 20 అంతస్తులపై పని చేస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యలు

పరిశ్రమలలో కనీస వేతనాలు అమలు చేయడం లేదు. వీరికి అన్‌స్కిల్డ్ వేతనం మాత్రమే ఇస్తున్నారు. 12గంటలు పని చేయిస్తున్నారు. చట్ట ప్రకారం రావలసిన ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంలేదు. ప్రమాదాలు జరిగిన పట్టించుకోవడంలేదు. ప్రమాదంలో మృతి చెందితే వారి మృతదేహాలను ఆగమేఘాల మీద స్వగ్రామాలకు తరలిస్తున్నారు.

గంజాయి మత్తులో

లేబర్ క్యాంపులలో గంజాయి గుప్పుమంటోంది. వలస కార్మికులు కొంత మంది ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పని చేసి రాత్రి కాగానే గంజాయి మత్తులో తూలుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మరికొంత మంది వలస కార్మికులు కష్టానికి తగిన ఫలితం రాకపోవడంతో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆశతో గంజాయి అమ్మడానికి సిద్ధమవుతున్నారు.

దళారుల పెత్తనం

ఈ ప్రాంతంలో పరిశ్రమలు, నిర్మాణరంగం అభివృద్ధి చెందటంతో పాటు ఇటుక బట్టీలు ఎక్కువగా ఉండటంతో కార్మికులకు మంచి డిమాండ్ ఉంది. స్థానికులు ఎక్కువ వేతానాలను డిమాండ్ చేయడంతో తక్కువ వేతనాలతో పనిచేసే వలస కార్మికులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో దళారులు రాజ్యమేలుతున్నారు.

పాలకులపై కోర్టు ఆగ్రహం

వలస కూలీల దుర్భర పరిస్థితులను నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను 2020 మే లో జస్టిస్ అశోక్ భూషణ్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. అయినా వారి బతుకులు మారడం లేదు. తక్కువ వేతనాలకు వలసకార్మికులు ఎక్కువ పనిగంటలు ఎందుకు పనిచేయాల్సి వస్తుందో వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ప్రమాదకరమైన చోట పని చేస్తున్నా వారికి ప్రభుత్వం ఎలాంటి రక్షణ కల్పిస్తోందని ప్రశ్నించగా సమాధానం చెప్పలేక అప్పటి సొలిసిటర్ జనరల్ ధర్మాసనం ముందు నీళ్లనమిలారు.

లైసెన్స్ తప్పనిసరి

1979 వలస కార్మికుల చట్టం ప్రకారం ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారంతా జిల్లా మేజిస్ట్రేట్ దగ్గర పేర్లు నమోదు చేయించుకోవాలి. వలస కార్మికుల కోసం ప్రత్యేక లైసెన్స్ కలిగి ఉండాలి. పని చేసే ప్రదేశంలో వలస కార్మికులకు వసతి సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యజమాన్యాలదే. కాంట్రాక్టర్‌లు కూడా వలస కార్మికుల లైసెన్స్ కలిగి ఉండాలి.

ఎక్కువగా ఉత్తరాది నుంచే..

కార్మికులు ఎక్కువగా ఉత్తర భారతదేశం నుంచే వస్తున్నారు. వారి ప్రాంతాలలో ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై తక్కువ వేతనానికే పని చేయడానికి ఇక్కడికి వస్తున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, అస్సాం, బెంగాల్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఈ ప్రాంతాలకు వలస వస్తున్నారు.

కనీస వేతనాలు కరువు..

వలస కార్మికులతో పనిచేయించుకుంటూ వారికి కనీస వేతనాలను కూడా ఇవ్వకుండా యాజమాన్యాలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయి. సుమారు 12 గంటల నుంచి 16 గంటలు వరకు వారితో పనిచేయించుకుంటున్నారు. దీనిపై అనేక కార్మిక సంఘాలు ఆందోళనలు చేపట్టినా అధికారులు పట్టించుకున్న పాపానలేదు. కొంతమంది రూ.12వేలు మించి పరిశ్రమ యాజమాన్యాలు చెల్లించడం లేదు. వలసకార్మికులకు కనీసం వేతనం రూ.25వేలు ఇవ్వాలని కార్మిక సంఘాల నేతలు గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే.

దివ్యాంగులవుతున్న కార్మికులు

పరిశ్రమలో, నిర్మాణ రంగాల్లో పనిచేసే ప్రదేశాల్లో సరైన భద్రత లేక ప్రమాదాలు జరగడంతో అనేకమంది కార్మికులు కాళ్లు, చేతులు కోల్పోయి దివ్యాంగులుగా మారుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందినవారు కావడంతో కేసులు లేకుండా వారికి నామమాత్రంగా నష్టపరిహారం అందించి వారిని స్వగ్రామాలకు పంపించివేస్తున్నారు. అనేకమందికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేకపోవడంతో చట్టపరంగా రావాల్సిన నష్టపరిహారం రావడంలేదు. ఈ విషయాలు అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

చట్టాలు అమలు కావడంలేదు



జిల్లాలో వలస కార్మికులు చట్టలు అమలు కావడం లేదు. ఈ విషయంపై గతంలో కలెక్టర్, జిల్లా కార్మిక సంక్షేమ అధికారులకు అనేకమార్లు వినతిపత్రాలు ఇచ్చాం. పరిశ్రమలలో ఎవరైన మృతి చెందితే యాజమాన్యాలు వారి కుటుంబ సభ్యులను తెప్పించుకుని ఎవరికీ తెలియకుండా అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని తరలించేస్తున్నారు. వారికి న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం ఇవ్వడం లేదు.

– కె.రాజయ్య, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు

పకడ్బందీగా అమలు చేస్తున్నాం



జిల్లాలో వలస కార్మికుల చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాం. వలస కార్మికులకు ఎలాంటి ఇబ్బందు లున్నా వాటి పరిష్కారానికి కృషి చేసున్నాం. ఎవరికైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలి.

–రవీందర్‌రెడ్డి, జిల్లా కార్మిక సంక్షేమ శాఖ అధికారి

నీట మునిగిన బావ బామ్మర్దులు

- స్నానానికి వెళ్లి ఒకరు... కాపాడబోయి మరొకరు
- రాత్రివరకూ తెలియని ఆచూకీ
- పొద్దుపోవడంతో ఆపేసిన గాలింపు చర్యలు
- బోరుపట్ల గ్రామంలో ఘటన



గల్లంతయిన వ్యక్తుల ఫైల్ ఫొటోలు

హత్నూర (సంగారెడ్డి): ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. హత్నూర మండల పరిధిలోని బోరుపట్ల గ్రామ శివారులో భీమునిచెరువులో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం...బోరుపట్ల గ్రామంలో గత రెండు రోజులుగా జరుగుతున్న శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల కోసం మల్కాపూర్ గ్రామపంచాయతీలోని కుతుబ్ షాహీపేట గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ భార్యా పిల్లలతో కలసి అత్తవారింటికి చుట్టపుచూపుగా వచ్చారు. మధ్యాహ్నం చెరువులోకి స్నానం చేసేందుకు ప్రేమ్ కుమార్ చెరువులో దిగాడు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత నీట మునిగిపోయాడు. ఎంతసేపటికీ పైకి రాకపోవడంతో అక్కడున్న మరికొందరు గ్రామంలోని ఆయన బంధువులకు సమాచారమిచ్చారు. భార్యా పిల్లలతోపాటు బంధువులు గ్రామస్వారిలోని భీముని చెరువు వద్దకు వచ్చి అతడి కోసం గాలించారు.

బావకోసం...

ప్రేమ్‌కుమార్ బావమరిది బోరుపట్ల గ్రామానికి చెందిన డప్పు నవీన్ కుమార్ మరికొంతమంది యువకులతో కలసి చెరువులోకి దిగాడు. కొద్ది సేపటి తర్వాత నవీన్ కుమార్ కూడా గల్లంతయ్యాడు. దీంతో ఇద్దరు యువకులు గల్లంతయ్యారని తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కొంతమంది యువకులు చెరువులోకి దిగి ఈ యువకులిద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలికి తహసీల్దార్ పరిహీన్ షేక్, ఎంపీడీవో శంకర్ ఎస్సై సుభాష్, ఆర్ ఐ శ్రీనివాస్ చేరుకుని సహాయక చర్యలో పాల్గొన్న సహాయక బృందాలకు పలు సూచనలు చేశారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు.

సీఎస్ఆర్ నిధులతో బస్సు ఏర్పాటు

సంగారెడ్డి జోన్: తోషిబా పరిశ్రమ తన కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద అందించిన నిధులతో సంగారెడ్డి మెడికల్ కళాశాలకు బస్సును ఏర్పాటు చేశారు. రూ.33లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ బస్సును శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి, విద్యార్థులతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జయంతికి ఏర్పాట్లు: కలెక్టర్

దివంగత ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని సంగారెడ్డిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక ప్రణాళికతో జిల్లాలో సన్నబియ్యం పంపిణీ జరుగుతోందని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు.

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ పరితోష్ పంకజ్



సీఐ స్వామి గౌడ్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ పరితోష్ పంకజ్

పటాన్‌చెరు టౌన్: సివిల్ తగాదాలలో తల దూర్చకూడదని, మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ స్పష్టం చేశారు. బీడీఎల్ పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, సిబ్బంది, అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. నైట్‌బీట్, పెట్రోలింగ్ అధికారులు వీధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీడీఎల్ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ల బది'లీలలు'

హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న ఓ మండలంలో పని చేసి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి పరోక్షంగా సహరించి రూ.కోట్లు గడించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ అధికారికి గురువారం జరిగిన ఈ బదిలీల్లో మళ్లీ కీలక మండలంలో పోస్టింగ్ దక్కింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే లూప్‌లైన్‌లో పనిచేసిన ఈ అధికారి మళ్లీ చక్రం తిప్పారు. గతంలో ఒకే మండలంలో చాలా ఏళ్లుగా.. వివిధ హోదాల్లో పనిచేసిన స్థానానికే ఈ బదిలీల్లో తిరిగి చేరుకోవడం వెనుక పెద్ద తతంగమే నడిచిందనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది.

ఈ బదిలీల్లో జిల్లాలో 17మంది తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. కానీ, ఎంతో కీలకమైన సంగారెడ్డి, పటాన్ చెరు, రామచంద్రాపురం వంటి కీలక మండలాల్లోని తహసీల్దార్లకు మాత్రం స్థాన చలనం కలగలేదు. దాదాపు ఇరవై నెలలుగా అక్కడగా పనిచేస్తున్న ఈ అధికారులకు బదిలీలు కాకపోవడం వెనుక కారణాలేంటనే దానిపైనా గుసగుసలు వినిపిస్తున్నాయి.

- గత సర్కారు హయాంలో కీలక స్థానాల్లో పనిచేసిన వారికే...
- ఈసారి కీలక మండలాల్లో పోస్టింగ్‌లు..
- చర్చనీయాంశంగా బదిలీల వ్యవహారం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తహసీల్దార్ల బదిలీల్లో జిమ్మిక్కులు చోటు చేసుకున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు తమకు అనుకూలమైన పోస్టింగ్ కోసం ప్రభుత్వ పెద్దలతో పాటు, సీసీఎల్ఏ స్థాయిలో పైరవీలు చేసినట్లు ఆశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాలో వివిధ చోట్ల పనిచేస్తున్న 17 మంది తహసీల్దార్లను ఒకేసారి బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. పరిపాలన సౌలభ్యం పేరుతో జరిగిన ఈ బదిలీల వెనుక భారీస్థాయిలో పైరవీలు జరిగాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో హవా నడిపించిన కొందరు అధికారులే...ఈ సర్కారు హయాంలో కూడా తమ హవాను కొనసాగిస్తుండటం గమనార్హం. ఈ బదిలీల్లో వీరికి మళ్లీ కీలక మండలాలు దక్కడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చనే అభిప్రాయం అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది.


వారి బదిలీలు ఉంటాయనుకుంటే...

అసెంబ్లీ ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు వివిధ జిల్లాలకు బదిలీపై వెళ్లిన విషయం విదితమే. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి తదితర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. ఇలా ఇతర జిల్లాలకు వెళ్లిన వారంతా సొంత జిల్లా సంగారెడ్డికి వచ్చేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి బదిలీలు ముందుగా జరుగుతాయని అందరూ అనుకున్నారు. కానీ అనూహ్యంగా జిల్లాలో వివిధ మండలాల్లో...వివిధ చోట్ల పనిచేస్తున్న తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడటం గమనార్హం. మొత్తం మీద తహసీల్దార్ల బదిలీలు కేవలం రెవెన్యూ వర్గాల్లోనే కాదు, ఇటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు



బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్: తప్పిపోయిన బాలుడిని రెండు గంటల్లోనే తల్లి వద్దకు చేర్చిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేష్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మంజీరా కాలనీ శివాలయం రోడ్డుకు చెందిన హనుమంత్ కుమారుడు కృష్ణ (3) శుక్రవారం ఆడుకుంటూ తప్పిపోయాడు. ఒక దగ్గర ఏడ్చుకుంటూ కనిపించడంతో స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు.. బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. వివరాల కోసం ఆరాతీయగా.. బీరంగూడలోని శివాలయం రోడ్డుకు చెందిన హనుమంతు, సునంద దంపతుల కుమారుడు కృష్ణగా గుర్తించారు. బాలుడిని తల్లి సునందకు అప్పగించారు. దీంతో కానిస్టేబుళ్లు స్వప్న, మహేశ్వర్, జయరాజ్‌లకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపింది.

తప్పిపోయిన శిశువు ఎక్కడ?

కొల్చారం/చిలప్‌చెడ్(నర్సాపూర్): తప్పిపోయిన ఆరు నెలల పసికందును అమ్మేశారా.. లేక చంపేశారా అన్న విషయం కొల్చారం, ఇటు చిలప్‌చెడ్ మండలాలలో చర్చనీయాంశంగా మారింది. చిలప్‌చెడ్ మండలం టోప్యా తండాకు చెందిన మహిళను కొల్చారం మండలం సీతారాంతండాకు చెందిన సునావత్ రాజుతో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. వారికి నాలుగు నెలల పాప ఉంది. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో జనవరి 20న రాజు ఇంటికి వచ్చే సరికి తల్లికూతుళ్లు కనిపించలేదు. ఈ, విషయాన్ని తన మామకు తెలియజేశాడు. జనవరి 28న కేసు నమోదు చేయడంతో తల్లిని తీసుకొచ్చారు. చిన్నారి గురించి తల్లిని విచారించగా, పొంతన లేని సమాధానాలు ఇస్తుందని పోలీసులు తెలిపారు. కాగా తన భార్య, కూతురు అదృశ్యమైన విషయమై తాను ముందుగానే కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు తనను విచారణ చేసి కేసు నమోదు చేయలేదని, తన భార్య తండ్రి దీప్ల ఫిర్యాదును కేసుగా నమోదు చేయడం ఏమిటని రాజు అనుమానం వ్యక్తం చేశాడు.

యువకుడి ఆత్మహత్య



నరేశ్

హవేళిఘణాపూర్ (మెదక్): ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. హవేళిఘణాపూర్‌కు చెందిన నరేశ్ (24) కుటుంబ కలహాలతో సతమతమవుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన నరేశ్.. ఇంట్లో తలుపులు వేసుకొని దూలానికి ఉరి వేసుకున్నాడు. గమనించిన అతని కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బైండోవర్ ఉల్లంఘనలో జరిమాన

అక్కన్నపేట(హుస్నాబాద్): బైండోవర్ ఉల్లంఘన కేసులో ఇద్దరికి జరిమానా విధించారు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. హుస్నాబాద్ ఎక్సైజ్ శాఖ సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు భూలి, ఈర్య గతంలో గుడుంబా కేసులో తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయ్యారు. ఇటీవల మళ్లీ గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడటంతో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘన కింద తహసీల్దార్ అనంతరెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరికి రూ.50 వేల చొప్పున జరిమానా విధించారు.

యువకుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పద్మారావు కాలనీకి చెందిన వేణు ప్రసాద్ (21) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 28న బయటకెళ్తున్నానని తన తల్లికి చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసి చూడగా స్విచ్ ఆఫ్ ఉంది. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

ప్రోత్సాహం అందించనున్న కేంద్ర ప్రభుత్వం

- ఎంఐడీహెచ్ పథకం కింద జిల్లాకు రూ.10 కోట్లు!
- పండ్లు, పూలతోటలతోపాటు కూరగాయల సాగు లక్ష్యం
- సబ్సిడీపై విత్తనాలు, నారు, సేంద్రియ ఎరువులు అందజేత
- కూరగాయల సమూహం పథకంలో సంగారెడ్డి జిల్లాకు చోటు
- అమల్లోకి వస్తే కష్టాల నుంచి గట్టెక్కనున్న రైతులు

రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు గాను కేంద్రం చేయూతనందిస్తోంది. ఇందులో భాగంగా సమీకృత ఉద్యాన అభివృద్ధి కార్యక్రమం (మిషన్‌ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్-ఎంఐడీహెచ్) పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఈ పథకం కింద సంగారెడ్డి జిల్లాకు రూ.10 కోట్ల మేర నిధులు వచ్చే అవకాశం ఉంది. కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాల పెంపకమే లక్ష్యంగా రైతులను ప్రోత్సహించనుంది. – జహీరాబాద్



నర్సరీలో పెంచుతున్న కూరగాయల నారు

రైతులు కష్టపడి పంటలను సాగు చేస్తున్నా వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతున్నారు. దీంతో పంటల సాగు రైతులకు భారంగా మారుతోంది. ఉద్యానవన పంటల సాగు లాభదాయకంగా ఉంటుందనే ఉద్దేశ్యతో రైతులు ఉద్యానవన పంటల సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. రాయితీ పథకాలు అందుబాటులో లేక పోవడంతో సాగుకు ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎంఐడీహెచ్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రణాళికను తాజాగా విడుదల చేసింది. ఈ పథకం అమలు కోసం ప్రతిపాదనలు కోరింది. అమలులోకి వచ్చిన నేపథ్యంలో రైతుల కష్టాలు గట్టెక్కే అవకాశం ఉంది.

యాంత్రిక పరికరాలు అందజేత

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంఐడీహెచ్ పథకం కింద రూ.145 కోట్లు కేటాయించింది. ఇందులో జిల్లాకు రూ.10 కోట్లు మంజూరు లభించే అవకాశం ఉంది. ఈ పథకం అమలు కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులను భరిస్తాయి. ఈ నిధులలో నుంచి ఉద్యాన పంటలు వేసుకునే రైతులకు రాయితీ అందించనున్నారు. రాయితీ కింద పండ్ల తోటలు, కూరగాయల విత్తనాలు, కూరగాయల నారు, ఇందు కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, రోటావేటర్లు, పవర్ వీడర్లు, తైవాన్, హ్యాండ్ స్ప్రేయర్లు, తదితర యాంత్రిక పరికరాలు అందించనున్నారు. సాగుకు రాయితీ అందితే పెట్టుబడులు ఖర్చు తగ్గనుంది. దీంతో ఉద్యానవన పంటల సాగుకు రైతులు ముందుకొచ్చే అవకాశం ఉంది.

జిల్లాకు దక్కిన చోటు

మెట్రో నగరాల్లో కూరగాయల కొరతను తీర్చేందుకు గాను కేంద్ర ప్రభుత్వం కూరగాయల సాగును పెద్ద ఎత్తున పెంచేందుకు నిర్ణయించింది. ఇందు కోసం రూ.2 వేల కోట్ల నిధులను కూరగాయల సమూహాల పథకం(మెట్రో అర్బన్ వెజిటీబుల్ క్లస్టర్ల) ప్రారంభించింది. ఇందులో హైదరాబాద్ నగరం ఉండడంతో నగరానికి వంద కిలో మీటర్ల వరకు ఉన్న ప్రాంతాల్లో కూరగాయలను పెంచాలనే యోచనతో ఉంది. దీంతో సంగారెడ్డి జిల్లాను ఇందులో చేర్చారు. సంగారెడ్డి జిల్లాతో పాటు దగ్గరలో ఉన్న వికారాబాద్, మహబూబ్ నగర్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాలకు కూరగాయల సమూహాల పథకం వర్తిస్తుంది. దీని కింద కూరగాయల సాగుకు రైతులు, రైతు సమూహాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘలను ప్రోత్సహిస్తారు. అవసరం అయితే కూరగాయల విత్తనాలు, నారు, సేంద్రియ ఎరువులు సబ్సిడీపై అందిస్తారు.

కూరగాయల సాగు పెంపకమే లక్ష్యంగా



సాగులో ఉన్న టమాట పంట

కూరగాయల సాగు పెంపకమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. గతం కంటే రాష్ట్ర వ్యాప్తంగా అదనంగా 50 వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకంతో పాటు కూరగాయల తోటల పెంపకం లక్ష్యంగా పెట్టుకుంది. సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రానికి రూ.145 కోట్లు కేటాయించింది. దీంతోపాటు మెట్రో అర్బన్ వెజిటబుల్ క్లస్టర్ పథకానికి హైదరాబాద్‌ను ఎంపిక చేసింది.

నిధులు రాగానే పథకం అమలు



ఎంఐడీహెచ్ పథకం కింద ఇంకా జిల్లాకు నిధులు రాలేదు. ఆ నిధులు రాగానే రైతులకు అవసరమైనవి అందిస్తాం. రైతులకు విత్తనాలు, నారు, షేడ్ నెట్, మల్చింగ్, టమాట క్రేట్లు, ఎరువులు సబ్సిడీపై అందించేందుకు వీలు పడుతుంది. గతేడాది కాలంలో రూ.1.03 కోట్ల నిధులతో జిల్లాలోని రైతులకు పలు పథకాలను అందించాం.

–సోమేశ్వర్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి, సంగారెడ్డి

కేబుల్ వైర్ల దొంగ పట్టివేత



కేబుల్ వైర్లతో భూమయ్య

కొల్చారం(నర్సాపూర్): బోరు బావుల దగ్గర నుంచి కేబుల్ వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్తున్న దొంగను పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండలంలోని ఎనగండ్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. చిలప్‌చెడ్ మండలం గౌతాపురం గ్రామానికి చెందిన సదరి భూమయ్య జల్సాలకు అలవాటుపడి వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగిలించి, వాటిని అమ్ముకుంటున్నాడు. ఉదయం గ్రామ శివారులోని రక్షిత మంచినీటి బోరు వద్దగల కేబుల్ వైరును దొంగిలిస్తుండగా పట్టుకున్నారు. కేబుల్ వైర్ల దొంగతనం విషయమై భూమయ్యను రైతులు విచారించగా.. చుట్టుపక్కల గ్రామాల్లో సైతం కేబుల్ వైర్లు దొంగతనం చేసినట్లు, దుంపలకుంట చౌరస్తాలో గల ఓ ఇంజనీరింగ్ దుకాణంలో వాటిని అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతన్ని పోలీసులకు అప్పగించారు.

యువకుడి రిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): అశ్లీల వీడియోను సోషల్ మీడియాలో ఫార్వాడ్ చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపారు. మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్‌కు చెందిన పుట్ట అనిల్ కొన్ని రోజుల క్రితం తన ఫోన్ ద్వారా అశ్లీల వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నాడు. సైబర్ సెక్యూరిటీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, సిమ్‌కార్డు, డీవీడీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సంగారెడ్డి ఫసల్వాది గ్రామానికి చెందిన బైండ్ల ప్రవీణ్ (21) పటాన్‌చెరు మండలం రుద్రారం పరిధిలోని తోషిబా కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన స్నేహితుడు ఇమ్రాన్‌తో కలిసి కంపెనీలో తనకు వచ్చే డబ్బులు తీసుకోవడానికి వెళ్లాడు. అక్కడి నుంచి పాశమైలారానికి ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. రుద్రారం శివారులో పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వీరిని ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇమ్రాన్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ప్రవీణ్‌కు సంవత్సరం క్రితమే వివాహం జరిగిందని, ప్రస్తుతం అతడి భార్య గర్భవతి అని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిజామాబాద్ వాసి మృతి

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన దేవన్‌పల్లి సాకేత్ (19) మృతి చెందాడు. సాకేత్ తన స్నేహితుడు శివతో కలసి స్కూటీపై హైదరాబాద్ వెళుతుండగా, రామాయంపేట శివారులో ప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొనగా, తలకు తీవ్ర గాయాలవడంతో సాకేత్ అక్కడికక్కడే మృతి చెందగా, శివ తీవ్రంగా గాయపడ్డాడు. సాకేత్ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. మృతుని తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దూరం పెట్టిందని మట్టుబెట్టాడు

- మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుడి అరెస్టు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, వెనకాల నిందితుడు రమేష్

జహీరాబాద్ టౌన్: కొంత కాలం సహజీవనం సాగించిన తర్వాత దూరం పెట్టిందని కక్షతో మహిళను దారుణంగా హత్య చేశాడు. ఈ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. శుక్రవారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఝరాసంగం మండలం చిలేమామిడికి చెందిన లక్ష్మి(40)కి భర్త లేడు, ఉపాధి కోసం పట్టణానికి వచ్చి పస్తాపూర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. కోహీర్ మండలం గొటిగార్‌పల్లికి చెందిన సత్యారం రమేష్(26)కు ఆమెతో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి రెండేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నారు. రమేష్ ప్రవర్తన నచ్చక దూరం పెట్టింది. అప్పటి నుంచి ఆమెపై కక్ష పెంచుకున్నాడు. తనను దూరం పెట్టి మరొకడితో ఉంటుందన్న కోపంతో ఆమెను హత్య చేయాలని నిర్ణయించాడు. మార్చి 29న రమేష్ కల్లుతాగి లక్ష్మికి ఇంటికి వెళ్లాడు. వెంట తెచ్చుకున్న పెంట్రోల్‌ను పోసి నిప్పు పెట్టాలని చూశాడు. గట్టిగా కేకలు వేయడంతో పక్కింటి మహిళా మరియమ్మ పరుగెత్తుకుంటూ రావడంతో అక్కడి నుంచి పారిపోయాడు. అదేనెల 31న ఉదయం రమేష్ మళ్లీ ఆమె ఇంటికి వెళ్లి బలవంతం చేయడానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కళ్లలో కారం చల్లి గ్యాస్ సిలిండర్ తీసుకుని తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మృతురాలి సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యాడు. శుక్రవారం హైదరాబాద్ పారిపోవడానికి ఆర్టీసీ బస్టాండ్‌కు రాగా నిందితుడిని అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టులో రిమాండ్ చేశామన్నారు. నిందితుడిని సకాలంలో పట్టుకున్న సీఐ.శివలింగం, ఎస్ఐ.కాశీనాథ్, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తేనే...

- లేదంటే ఎక్కడి గొంగళి అక్కడే...
- సమస్యలను నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్న స్థానికులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



నీటిని నిల్వ గుంతను ధ్వంసం చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలను స్థానికులు అనేకసార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ఇక చేసేదేమీ లేక ఆ సమస్యలను నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తున్నారు. వెంటనే తన దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలపై కలెక్టర్ స్పందించడంతోపాటు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని అనేక సమస్యలు కలెక్టర్ పుణ్యమంటూ పరిష్కారమయ్యాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ దృష్టికి వచ్చిన సమస్యలపై స్థానిక అధికారులను వివరణ కోరడంతోపాటు వాటిని వెంటనే పరిష్కారించాలని ఆదేశిస్తుండటంతో స్థానిక అధికారులు ఆగమేఘాలమీద చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది తెల్లాపూర్ పరిధిలో జోరుగా నీటి దందా జరగడంతో దీనిని అరికట్టాలని స్థానికులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పట్టించుకోకపోవటంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో రాత్రికి రాత్రే అధికారులు నీటి ట్యాంకర్లను సీజ్ చేశారు. తిరిగి కొద్ది రోజులుగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో జోరుగా నీటి దందా మొదలైంది. దీనిని నియంత్రించాలని అధికారులను కోరినా వారు పట్టించుకోకపోవడంతో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకునిపోవడంతో అధికారులలో తిరిగి చలనం వచ్చింది. అక్రమ నిర్మాణాలపై సైతం అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో నేరుగా కలెక్టర్ దృష్టికే తీసుకునిపోతున్నారు.



నుజ్జునుజ్జయిన డీసీఎం ముందు భాగం

కంటైనర్‌ను ఢీకొన్న డీసీఎం

ఇరుక్కుపోయిన డ్రైవర్.. తీవ్ర గాయాలు

తూప్రాన్: ముందు వెళుతున్న కంటైనర్‌ను వెనకాల నుంచి డీసీఎం ఢీకొనడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఈ సంఘటన 44వ జాతీయ రహదారిపై మాసాయిపేట స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని వెనకాల నుంచి డీసీఎం అతివేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన డీసీఎం డ్రైవర్ కబ్రేజ్ క్యాబిన్ లోనే ఇరుక్కుపోయాడు. కుడికాలు నుజ్జునుజ్జయింది. జీఎమ్మార్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని బయటకు తీసి గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా హైవేపై వాహనాలు స్తంభించి పోయాయి.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం

- 15 రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి..
- హాస్టల్ ఎదుట విద్యార్థి తల్లిదండ్రుల ధర్నా



మెగావత్ కుమార్(ఫైల్)



విద్యార్థులతో కలిసి హాస్టల్ గేటు ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు, నాయకులు

వట్‌పల్లి(అందోల్): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం దేవునూరు బాలుర హాస్టల్ నుంచి ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. పక్షం రోజుల క్రితం జరిగిన ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మండల పరిధిలోని పెద్దతండాకు చెందిన మెగావత్ కుమార్(15) దేవునూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ.. అదే గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటున్నాడు. గత నెల మార్చి 20న కుమార్ పాఠశాలకు హాజరుకాగా.. అదే రోజున సాయంత్రం హాస్టల్ నుంచి వెళ్లిపోయాడని సహచర విద్యార్థులు చెబుతున్నారు. ఉగాది పండుగ సందర్భంగా అదే తండాకు చెందిన పలువురు విద్యార్థులు హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిపోగా..తమ కుమారుడు రాలేదని కుమార్ తల్లిదండ్రులు వార్డెన్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. అయితే.. కుమార్ ఇంటికి వెళ్లినట్లు వార్డెన్ సమాధానం చెప్పడంతో తల్లిదండ్రులు కంగుతిన్నారు. వార్డెన్‌ను నిలదీశారు. అనంతరం వారు శుక్రవారం వట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ సుధాకర్ వివరాలు సేకరించే క్రమంలో మార్చి 29 వరకు విద్యార్థి హాస్టల్‌లో ఉన్నాడని, తర్వాత కనపించలేదని వార్డెన్ చెప్పే మాటలకు, స్కూల్ రిజిస్టర్‌లో మార్చి 20 వరకు మాత్రమే విద్యార్థి హాజరైనట్లుగా నమోదై ఉంది. వార్డెన్ మాటలకు పొంతన లేకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ తీరును నిరసిస్తూ విద్యార్థులతో కలిసి హాస్టల్ గేటు ఎదుట బైఠాయించారు. విషయం తెలిసిన జోగిపేట సీఐ అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. విద్యార్థి తల్లి లక్ష్మీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డంప్‌యార్డును పరిశీలించిన డీపీఓ



కంది డంప్ యార్డును పరిశీలిస్తున్న డీపీఓ సాయి బాబ

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కంది శివారులో గల డంప్‌యార్డును శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) సాయిబాబ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శనివారం నుంచి జేసీబీలతో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రక్కన పేరుకు పోయిన చెత్తను ప్రస్తుతం ఉన్న షెడ్డు వద్దకు తరలించాలని సూచించారు. షెడ్డును పూర్తిస్థాయిలో వినియోగించుకుని చెత్తశుద్ధి యంత్రంతో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలన్నారు. అలాగే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీయల్పీవోఅనిత, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధమే శ్వాసగా... సాగిపోవాలిక్కడ

జాతీయ రహదారి పక్కనే చెత్త డంపింగ్

- కుప్పలు కుప్పలుగా వ్యర్థ పదార్థాలు
- ఇష్టానుసారంగా వదిలేస్తున్న వైనం
- రహదారుల పక్కన వెదజల్లుతున్న దుర్వాసన
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారి పక్కన వ్యర్థాలు

సంగారెడ్డి జోన్: ప్రధాన జాతీయ రహదారికి ఇరువైపులా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండాల్సిన పరిసరాలు అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ, పట్టింపు లేనితనంతో రోడ్డు పక్కన ఇష్టారాజ్యంగా చెత్తను డంపింగ్ చేస్తున్నారు. చెత్తను, వ్యర్థాలను పారేయడంతో రాకపోకలు సాగించేవారు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డున వెళ్లాలంటే 'సాహసం శ్వాసగా చేసుకుని'ప్రయాణించాలని వ్యంగ్యంగా చెబుతున్నారు.

చెత్త కుప్పలు.... వ్యర్థ పదార్థాలు

హైదరాబాద్ నుంచి ముంబై వెళ్లే ప్రధాన జాతీయ రహదారి 65 జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణం మీదుగా వెళ్తుంది. రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సంగారెడ్డి పట్టణం నుంచి జహీరాబాద్ వెళ్లే రహదారి పక్కన పచ్చని చెట్ల కింద చెత్తను కుప్పలు కుప్పలుగా పారబోస్తున్నారు. అంతే కాకుండా వృథాగా మిగిలిన కూరగాయలు, వివిధ రకాల పండ్లు ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. సంచులలో నింపి పారేసి వెళ్తున్నారు. సంగారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో సంగారెడ్డి శివారులో రోడ్డు పక్కన ప్లాస్టిక్ కాగితాలు చెత్త విచ్చలవిడిగా కనిపిస్తుంటాయి. దీంతో రహదారుల పక్కన డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్నాయి.

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రహదారులకు ఇరువైపులా చెత్తకుప్పలను వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బలమైన గాలులు వీచిన సమయంలో చెత్త కుప్పలో నుంచి ప్లాస్టిక్ కాగితాలు, చెత్తాచెదారం రహదారుల పైకి వస్తోంది. చెత్తకుప్పలకు మంట పెట్టిన సమయంలో వచ్చే పొగతో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు చెబుతున్నారు. ఫలితంగా వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

మూగజీవాలకు సైతం ఇబ్బందులు

చెత్త వేసిన ప్రాంతాలలో పశువులు సంచరించడంతో వాటికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. కుళ్లిన వ్యర్థాలు తినడంతో రోగాల బారిన పడే అవకాశం ఉంది. రహదారులకు ఇరువైపులా చెత్తను వేయకుండా చూడాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చెత్తను పారబోయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. చెత్తను ఇష్టానుసారంగా పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటున్నారు.

వెదజల్లుతున్న దుర్వాసన

వివిధ రకాల కూరగాయలు, పండ్లు ఇతర రకాల వ్యర్థాలను ఇష్టానుసారంగా పారేస్తున్నారు. కొన్ని రోజులపాటు అక్కడే ఉండటంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. తోడుగా కురిసిన వర్షం నీటికి మరింతగా భరించలేని కంపు కొడుతోంది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు దుర్వాసనకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అంతేకాకుండా పలు సందర్భాలలో చెత్తను కుప్పలుగా వేసి తగలబెడుతున్నారు. వృక్షాలుగా మారిన మొక్కలు కాలిపోతున్నాయి.